ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
మంగళవారం 25 నవంబరు 2025



బీసీలకు దక్కింది 26%



అధికారులు తుది కసరత్తు పూర్తి చేసి గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎట్టకేలకు రిజర్వేషన్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 46 మార్గదర్శకాలకు లోబడి, రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఈ ప్రక్రియను ఖరారు చేశారు. సిద్దిపేట జిల్లాలోని 26 మండలాల్లో ఉన్న 508 గ్రామ పంచాయతీలు, 4,508 వార్డులకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను కలెక్టర్ హైమావతి విడుదల చేశారు. దీని ప్రకారం పంచాయతీల్లో బీసీలకు 26 శాతం రిజర్వేషన్లు మాత్రమే దక్కాయి.

గ్రామపంచాయతీ రిజర్వేషన్లు ఖరారు!

50 శాతానికి లోబడి జీవో 46 ప్రకారం ప్రకటన

42 శాతం ఆశించిన బీసీలకు నిరాశ

మహిళలకు 232 స్థానాలు..

గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి

మండలాల వారీగా జీపీల రిజర్వేషన్లు

మండలం	జీపీలు	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
అక్బర్‌పేట-భూంపల్లి	19	0	4	5	10
అక్కన్నపేట	38	12	5	7	14
బెజ్జంకి	24	0	6	6	12
చేర్యాల	20	0	4	6	10
చిన్నకోడూర్	28	0	5	9	14
దౌల్తాబాద్	25	1	5	7	12
ధూళిమిట్ట	11	3	1	3	4
దుబ్బాక	21	1	4	6	10
గజ్వేల్	25	0	6	6	13
హుస్నాబాద్	17	2	3	3	9
జగదేవ్‌పూర్	25	0	4	8	13
కోహెడ	27	1	5	7	14
కొమురవెల్లి	11	0	3	2	6
కొండపాక	15	0	3	4	8
కుకునూర్‌పల్లి	14	0	3	4	7
మద్దూరు	10	0	2	3	5
మర్కూక్	16	0	3	5	8
మిరుదొడ్డి	10	0	2	3	5
ములుగు	26	0	5	8	13
నంగునూరు	25	1	5	6	13
నారాయణరావుపేట	11	0	2	3	6
రాయపోల్	19	0	4	5	10
సిద్దిపేట రూరల్	15	0	3	4	8
సిద్దిపేట అర్బన్	12	0	2	4	6
తొగుట	17	0	3	5	9
వర్గల్	27	1	5	7	14
మొత్తం	15	22	97	136	253

జిల్లాలో జీపీల రిజర్వేషన్లు

కేటగిరి	రిజర్వేషన్
ఎస్టీ	22
ఎస్సీ	97
బీసీ	136
జనరల్	253
మొత్తం	508

సిద్దిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ(జీపీ) రిజర్వేషన్లు వాస్తవానికి ఆది వారం రాత్రే ప్రకటించాల్సి ఉన్నా, ఆర్డీవో కార్యాల యాల నుంచి సమాచారం ఆలస్యం కావడంతో సోమవారం మధ్యాహ్నం అధికారికంగా ప్రకటిం చారు. దీంతో ఉత్కంఠకు తెరపడింది.

మహిళలకు 232 స్థానాల కేటాయింపు

జిల్లాలో మొత్తం గ్రామీణ ఓటర్లు 6,55,958. వీరిలో పురుషులు 3,21,766, మహిళలు 3,34,186, ఇతరులు ఆరుగురు ఉన్నారు. జిల్లాలోని మొత్తం 508 గ్రామ పంచాయతీలకు గానూ 232 స్థానాలు మహిళలకే కేటాయించారు. వీటిలో ఎస్టీ మహిళకు 8 (షెడ్యూల్, నాన్ షెడ్యూల్ కలిపి), ఎస్సీ మహి ళకు 41, బీసీ మహిళకు 61, జనరల్ మహిళకు 122 స్థానాలు ఉన్నాయి. 508 గ్రామ పంచాయతీలకు సంబంధించి, ఎస్టీ జనాభా ఉన్న గ్రామాల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ కల్పించాలన్న నిబంధన మేరకు షెడ్యూల్ ప్రకారం వంద శాతం ఎస్టీలు ఉన్న చోట 15 రిజర్వేషన్లను కేటాయించారు. మిగతా వాటికి సంబంధించి నాన్ షెడ్యూల్ ప్రకారం ఖరార య్యాయి.

బీసీలకు తప్పని నిరాశ..

ఈ రిజర్వేషన్లతో బీసీలకు నిరాశ తప్పలేదు. సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 26.7 శాతమే దక్కాయి. ఇక వార్డు

మిగతా 8వ పేజీలో

వార్డు స్థానాల రిజర్వేషన్లు

మొత్తం వార్డులు	4,508
ఎస్టీలకు (షెడ్యూల్ 110, నాన్ షెడ్యూల్ 59)	169
ఎస్సీలకు	849
బీసీలకు	1,287
జనరల్	2,203

గౌరవెల్లికి త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలి

- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శిని కలసిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులతో పాటు హుస్నా బాద్ ప్రాంతంలోని గౌరవెల్లి రిజర్వాయర్‌కు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్య దర్శి తన్మయి కుమార్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయనను కలిసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడు తున్న నీటి పారుదల ప్రాజెక్టులు, వాటికి సంబం ధించిన అనుమతులపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు వనశక్తి తీర్పును వెనక్కి తీసు కుందని, దీనిపై న్యాయసలహా తీసుకొని అనుమ తులు మంజూరు చేస్తామని తన్మయికుమార్ చెప్పారని తెలిపారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమ తులు మంజూరు చేస్తే ప్రజలకు తాగునీరు, రైతు లకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతా యని కార్యదర్శికి వివరించామని పేర్కొన్నారు.



కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పొన్నం

సర్కారు ఆసుపత్రులు కేంద్ర నిధులతోనే నడుస్తున్నాయి

రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన నిధులు ఇవ్వడం లేదు

మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అభివృద్ధికి కృషి చేస్తా

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హుస్నాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సర్కారు ఆసుపత్రులు నడుస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు ఇవ్వకపోవడం వల్లే చిన్నచిన్న అవసరాలు కూడా తీరడం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేదని ఆరోపించారు. సోమ వారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తాను మంజూరు చేసిన రూ.కోటి విలువైన వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు గతంలో తీవ్ర నిర్లక్ష్యా నికి గురయ్యాయని, కనీసం కుక్క కాటు ఇంజెక్షన్లు, సూదులు, మందులు, పరీక్షా పరికరాలు కూడా అందుబా టులో లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రు లకు వస్తారని, వారికి మంచి వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. చికిత్స కోసం రోగులు బయ టకు వెళ్లాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఆస్పత్రు లకు అవసరమైన సాయం అందిస్తున్నానని సంజయ్ తెలి పారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హుస్నాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, ఆసు పత్రి సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న బండి సంజయ్

సంజయ్‌ను కలిసిన తారవ్వ

పత్తి రైతులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిశారు. ఎకరాకు 7 నుంచి 9 క్వింటాళ్లకు పత్తి కొనుగోలును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. తమకు సీసీఐ ద్వారా మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. సీసీఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల భారీ వర్షా లకు ధాన్యం కొట్టుకుపోవడంతో మంత్రి సంజయ్ పంపిన తక్షణ సహాయం రూ.50 వేలు అందుకున్న మహిళా రైతు తారవ్వ ఈ సందర్భంగా ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 'సంజయన్న మీరు దేవుడిచ్చిన అన్నవు. మీ సాయం జన్మలో మరిచిపో లేను' అంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు.



బండి సంజయ్‌ను ఆప్యాయంగా హత్తుకున్న రైతు తారవ్వ

హర్‌ఘర్ సూర్య యోజనతో సోలార్ వెలుగులు

మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్

తొగుట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి హర్‌ఘర్ సూర్య యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని, ప్రతీ ఇంట్లో సోలార్ వెలుగులను పొందాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం తొగుట మండలం తుక్కా పూర్ గ్రామంలో పోచమ్మగుడి కాంపౌండ్ వాల్ నిర్మాణం, ముదిరాజ్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి, నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీహాల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లా డుతూ నిర్వాసిత రైతులు కేవలం చేపలు పట్టుకోవడమే కాకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఎంచుకోవా లని సూచించారు. తుక్కాపూర్ గ్రామస్థులను అన్ని రకా లుగా ఆదుకోవడమే కాకుండా, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. సోలార్ ప్యానెళ్లు పెట్టుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు భారత ప్రభుత్వం ఒక ఇంటికి 2 కిలోవాట్ల వరకు విద్యుత్ తయారుచేసుకోవడానికి రూ.70 వేల నుంచి రూ. 78 వేల వరకు సబ్సిడీని అందజేస్తుందని తెలి పారు. ఉచిత విద్యుత్ ఇస్తామనే బోగస్ మాటలు తమవి కావన్నారు. సోలార్ ప్లేట్లను పెట్టుకోవడానికి సిద్ధంగా ఉంటే రెడ్కో ఆఫీసర్‌ను పంపిస్తామని, వారు దరఖాస్తు, సబ్సిడీ వివరాలను వివరిస్తారని చెప్పారు. అంతకుముందు, గ్రామ చౌరస్తా నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్ నేతృత్వంలో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. కాన్గల్ గ్రామస్థులు ఎంపీని కలిసి, రహదారి సమస్యను వివరించారు. దీనిపై వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, నాయకులు విభీషణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో ఆంక్షారెడ్డి

పీసీసీ ప్రెసిడెంట్‌ను కలిసిన ఆంక్షారెడ్డి

గజ్వేల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురా లిగా ఎన్నికైన తూంకుంట ఆంక్షారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞ తలు తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, బెజుగామ శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, కొడిప్యాక నారాయణ, కృష్ణ తదితరులున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- కలెక్టర్ హైమావతి ఆదేశం

సిద్దిపేట/సిద్దిపేట రూరల్/హుస్నాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తు లపై అధికారులు సత్వరమే స్పందించాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ హైమావతి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 123 వినతులను స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరా జమ్మ, ఏవో రాజ్‌కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు, అవినీతిపై ఫిర్యాదులు

● సిద్దిపేట జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్డులో భాగంగా పుల్లూరు, రావురూకుల మీదుగా వేసిన రోడ్డు అసంపూర్తిగా ఉండటం వల్ల తరచుగా ప్రమాదాలు జరు గుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గుంతలతో నిండిన రోడ్డు వల్ల రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ మధ్యే ఒక వ్యక్తి కుటుంబంతో వెళ్తూ ప్రమాదానికి గురైన సందర్భం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే పనులను పూర్తి చేయాలని ఆయన కోరారు.

● హుస్నాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతికి పాల్పడుతున్నా రని, దీనిపై విజిలెన్స్, శాఖాపరమైన విచా రణ జరిపించాలని కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. హుస్నాబాద్‌లో నిబంధనలకు విరు ద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తు న్నారని, ప్రభుత్వ భూముల్లోనూ నిర్మాణా లకు పర్మిషన్లు ఇస్తున్నారని ఆరోపించారు. సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిన ఇళ్లకు రూ.50 వేలు తీసుకుని ఉదాసీనంగా వ్యవహ రిస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే పార్కింగ్ లేని చోట వైన్స్‌షాపులకు అనుమ తులు ఇవ్వవద్దని ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.



ఫిర్యాదు చేస్తున్న బండి శివకుమార్

నిమోనియాతో బాలుడి మృతి

హుస్నాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలుడు నిమోనియో వ్యాధితో బాధపడుతూ మృతిచెందిన సంఘ టన సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నా బాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం.. తోటపల్లి గ్రామానికి చెందిన పోలవేని ప్రదీప్-సౌమ్య దంపతుల కుమారుడు దియాన్(6) శుక్రవారం తీవ్ర జ్వరంతో బాధపడ్డాడు. చికిత్స నిమిత్తం హుస్నాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి పరీక్ష చేయించారు. అయినా జ్వరం తగ్గలేదు. దీంతో మెరు గైన వైద్యం కోసం హనుమకొండ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీ క్షలు చేయగా ఊపిరితిత్తుల్లో నిమోనియా చేరి బాలుడికి శ్వాస ఆడడం లేదని వైద్యులు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బాలుడు దియాన్ మృతి చెందినట్లు తెలిపారు. బాలుడు మృతితో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి.



దియాన్ (ఫైల్)





మంచు దుప్పటి

సిద్దిపేట పట్టణాన్ని సోమవారం ఉదయం పొగమంచు కప్పేసింది. ఉదయం 9 గంటలైనా రోడ్లు కనిపించలేదు. వాహనదారులు హెడ్ లైట్ వేసుకుని వాహనాలు నడిపారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



రాజగోపురం శుద్ధి

కొమురవెల్లి మల్లన్న స్వామివారి కల్యాణం వచ్చే నెల 14న నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆలయాధికారులు సోమవారం ఆలయ రాజగోపురాన్ని, పరిసరాలను ఫైరింజన్ ద్వారా నీళ్లతో శుద్ధి చేయించారు. ఆలయ సహాయ కార్య నిర్వహణధికారి శ్రీనివాస్, పర్యవేక్షకుడు నీల శేఖర్, గజ్వేల్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు.

- కొమురవెల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి)

పత్తి చేనులో మేతకు వదిలిన 16 మేకలు మృతి


మొలకలపాడులో మృతి చెందిన మేకలు

న్యాల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనులో మేతకు వదిలిన మేకలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మొలకలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన మేతరి సంజీవ్ తన మేకలను పత్తి చేనులో మేతకు వదిలాడు. కొంతసేపు మేత తిన్న తరువాత మేకలు ఒక్కొక్కటి మృత్యువాతపడ్డాయి. వీటి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కరెంటు తీగలు తగిలి వరి కోత మిషన్ దగ్ధం


బొంతపల్లిలో దగ్ధమవుతున్న వరి కోత మిషన్

గుమ్మడిదల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో వరి కోత యంత్రం దగ్ధమైన ఘటన సోమవారం బొంతపల్లి గ్రామంలో జరిగింది. గ్రామంలోని అయ్యప్ప ఆలయ సమీపంలో రైతు కిష్టయ్యకు చెందిన పొలంలో వరి కోత మిషన్‌తో కోతలు కొనసాగిస్తుండగా కరెంటు తీగలను తాకింది. దీంతో నిప్పురవ్వలు ఎగిసిపడి కోత మిషన్‌కు మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. చూస్తుండగానే హార్వెస్టర్ పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సమీపంలోని పరిశ్రమల నుంచి ఫైరింజన్లను రప్పించి మంటలను అదుపు చేయడంతో వరి పంటకు నష్టం తప్పింది. వేలాడుతున్న విద్యుత్ తీగలు వేలాడుతున్నా విద్యుత్‌శాఖ సిబ్బంది సరి చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

గంజాయి రవాణా కేసులో దోషికి పదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా రవాణా చేసిన కేసులో దోషికి పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి సోమవారం తీర్పు చెప్పారు. పోలీసులు వివరాల ప్రకారం... ఛత్తీస్‌గడ్ రాష్ట్రం అనపారా కంకర్‌కు చెందిన లలిత్‌కుమార్(34) 2019లో 111 కిలోల ఎండు గంజాయి రవాణా చేస్తుండగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో లలిత్‌కుమార్‌కు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

మంజీరా నుంచి ఇసుక తరలింపు

ట్రాక్టర్లు, ఇసుక నిల్వల సీజ్

పుల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి వద్ద మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యాజమానులు మంజీరా నది నుంచి నాలుగైదు రోజులుగా కూలీల సహాయంతో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గిర్దావర్ ప్రమోద్‌కుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. డ్రైవర్ పరారుకావడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నది ఒడ్డున ఇసుక నిల్వలను తహసీల్దార్ నామాల కిష్టయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పరిశీలించి ఇసుక నిల్వలను సీజ్ చేశారు. మూడు రోజుల్లో ఇసుకను వేలం వేస్తామని తహసీల్దార్ తెలిపారు.


సరాఫ్‌పల్లి వద్ద మంజీరా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

కారు, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గజ్వేల్ మండలంలోని జాలిగామ గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాల మల్లేశం లక్ష్మి, ప్రజ్ఞాపూర్‌కు చెందిన పోచవ్వ, ముగ్గురు రాయపోల్ మండలం టెంకంపేట నుంచి ఆటోలో గజ్వేల్‌కు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో జాలిగామ గ్రామం వద్ద కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు.

కుంటలో పడి ఒకరి మృతి


హర్షదుద్దీన్(ఫైల్)

చేగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ-2 బిక్యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా భరత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ హర్షదుద్దీన్(40) అత్తగారిల్లయిన మక్కరాజుపేటలో ఉంటూ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి కాలకృత్యాలకు వెళ్లి చాన్కాన్ కుంటలో కాలుజారిపడి మృతిచెందాడు. మృతుడికి భార్య తాహెరాబేగం, కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. హర్షదుద్దీన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అదృశ్యమైన పాత నేరస్థుడి మృతి


రాజాసింగ్(ఫైల్)

పటాన్‌చెరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమయిన పాత నేరస్థుడు కుంటలో శవమై తేలిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్టలో నివసించే రాజాసింగ్ (30) కనిపించడం లేదని 20వ తేదీన అతడి సోదరుడు గోపీసింగ్ జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి ఒంటి గంట సమయంలో రాజాసింగ్ కారు నడుపుకుంటూ ఐడీఏబొల్లారం వద్ద ఔటర్ రింగురోడ్డు సర్వీస్ రహదారి మీదుగా పట్టణంలోకి వచ్చారు. పెట్రోలింగ్ పోలీసులు అనుమానంతో కారును అడ్డుకోవడంతో రాజాసింగ్ పరారయ్యాడు. సీఐ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కారును తనిఖీ చేయగా కత్తులు దొరికాయి. పారిపోయిన రాజాసింగ్ కోసం స్థానికుల సహాయంతో పోలీసులు తెల్లవారేవరకు వెతికారు. కానీ, మాధవానికుంట మీదుగా చెట్ల పొదల్లోంచి పారిపోయాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం మాధవానికుంటలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఆన్‌లైన్‌లో ఫొటోలు ఉంచారు. ఈ ఫొటోలు చూసిన జగద్గిరిగుట్ట పోలీసులు మృతుడిని కనిపించకుండాపోయిన రాజాసింగ్‌గా గుర్తించారు. మృతుడిపై జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, కూకట్‌పల్లి, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 20 దొంగతనం కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

ముస్త్యాలలో పట్టపగలే చోరీ

వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరణ


బైక్‌పై పరారవుతున్న అనుమానితుడు

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం పట్టపగలే ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారుగొలుసు అపహరించుకుపోయిన సంఘటన కలకలం రేపింది. గ్రామ శివారులోని కాలనీకి చెందిన సొంటె నర్సమ్మ కుటుంబ సభ్యులు ఇంట్లో ఎవరు లేకపోవడంతో మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఒంటరిగా కూర్చుంది. హెల్మెట్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి గమనించి తెలిసిన వారిలా మాట్లాడించేందుకు ప్రయత్నించి నర్సవ్వ మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల గొలుసును లాగేసుకుని బైక్‌పై పరారయ్యాడు. నర్సవ్వ బోరున విలపించడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో దర్యాప్తు చేపట్టారు. సమీపంలో ఓ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై మద్దూరు వైపుకు ఉడాయించడాన్ని గుర్తించారు. చోరీ ఘటనలో రూ.4.50లక్షల నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా, ఇటీవల మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణం అపహరించిన సంఘటన మరువకముందే ముస్త్యాలలో పట్టపగలే అపహరణ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కోటి పరిహారం ఇంకెప్పుడు?

- 4 నెలలుగా సిగాచి బాధితుల ఎదురుచూపులు
- రూ.26 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్న వైనం
- సీఎం సమాధానం చెప్పాలంటున్న ప్రజాసంఘాలు
- పరిశ్రమ నిర్లక్ష్యమే 54 మంది ప్రాణాలను బలిగొంది
- హైకోర్టు మొట్టికాయ వేసినా యజమాన్యంలో చలనం లేదు
- ఈ కేసులో తదుపరి విచారణ ఈనెల 27న



సిగాచి పరిశ్రమ

పటాన్‌చెరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో 54 మంది మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇస్తానన్న యాజమాన్యం మాట కలగానే మారింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాదం జరిగిన తర్వాత పరిశ్రమ వద్ద మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తలా రూ. కోటి పరిహారం అందించే ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. సీఎం హామీ ఇచ్చి నాలుగు నెలలు పూర్తయినా యాజమాన్యం ఇంకా నెరవేర్చలేదు. ఇప్పటివరకు యజమాన్యం ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున చెల్లించగా, ప్రభుత్వం తరఫున రూ.లక్ష అందింది. యాజమాన్యం ఇంకా రూ.75 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం నుంచి కూడా బాధిత కుటుంబాలకు ఎటువంటి సమాధానం లభించడం లేదు. పౌర సంఘాలు కూడా బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. సిగాచి ప్రమాదంలో 46 మంది మృతి చెందగా, ఎనిమిది మంది గల్లంతయ్యారు. 28 మంది గాయపడగా వారంతా అస్పత్రుల నుంచి ఇంటికొచ్చినా రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు.

192 మంది సాక్షుల విచారణ

సిగాచి పరిశ్రమపై న్యాయపోరాటం చేయడానికి రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబురావు హైకోర్టును ఆశ్రయించగా, ఈ కేసును న్యాయవాది వసుధ నాగరాజు వాదిస్తున్నారు. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సిగాచి పారిశ్రామిక అగ్నిప్రమాదంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. దర్యాప్తు కొనసాగుతోందని, ప్రస్తుతం పోలీసులు 192మంది సాక్షులను విచారిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పటంతో, సీఆర్‌పీసీ సెక్షన్ 161 ప్రకారం సాక్షుల వాంగ్మూలాలు పూర్తయ్యాకే అరెస్టు చేయాలనే నియమం ఎక్కడుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించటం గమనార్హం. ఈ కేసు ఈనెల 27వ తేదీన హైకోర్టులో తదుపరి విచారణ జరిగింది. కాగా సిగాచి యాజమాన్యం నిర్లక్ష్యపూరిత వైఖరి వల్లే ఘోర దుర్ఘటన చోటు చేసుకుందని సాంకేతిక నిపుణుల కమిటీ సైతం స్పష్టం చేసింది. మైక్రో క్రిస్టల్ సెల్యూలోజ్ ధూళికి అధికంగా మండే స్వభావం ఉందని తెలిసినా నిర్లక్ష్యం వహించటం, ప్రొడక్షన్ యూనిటీ మీద మొదటి అంతస్తులో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్‌మెంట్ ల్యాబ్ ఏర్పాటు చేయటంతో పాటు, సేఫ్టీ నిబంధనలు పెడచెవిన పెట్టటం, మిషనరీ మార్చకుండానే క్వాలిటీ పెంపుదల, అనుమతులకు మించి విద్యుత్తు వినియోగం, ఉత్పత్తి పెంచినా, అందుకు తగినట్లుగా కనీస విస్తరణ చేయకపోవడం, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినా ఆర్పే వ్యవస్థ నామమాత్రంగానే ఉండటం, ఇరుకైన స్థలంలో నిర్మాణాల కారణంగా ప్రమాద తీవ్రత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులూ తమ విధులు సరిగా నిర్వర్తించలేదని ప్రభుత్వానికి అందించిన నివేదికలో సాంకేతిక నిపుణుల కమిటీ పేర్కొంది.

పూర్తి పరిహారం ఇప్పించాలి



సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నా భర్త నాగేశ్వరావు చనిపోవడంతో మా కుటుంబం సమస్యల్లో పడింది. ఇస్తానన్న పరిహారం కోసం చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రజాసంఘాలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో కదలిక వస్తేనే మాకు నష్టపరిహారం లభిస్తుందని అనుకుంటున్నాం.

- సిగాచి మృతుడు నాగేశ్వరరావు భార్య సులోచన

ఉత్సాహంగా క్రికెట్ జట్ల ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జుబ్లీ క్లబ్‌లోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ జట్ల ఎంపికలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్‌లో పాల్గొనే ఆరు జట్ల ఎంపికలు సంగారెడ్డి, సిద్దిపేటలో జరిగాయని మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలో నాలుగు జట్లకు 60 మందిని ఎంపిక చేయగా, సిద్దిపేటలో రెండు జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు ఆయన వివరించారు. ఈ ఆరు జట్ల మధ్య లీగ్ పోటీలు ఈ నెల 27 నుంచి ప్రారంభంకానున్నాయని పేర్కొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కోచ్ శ్రీనాథ్‌రెడ్డి, కలీం, తోహీద్, చంద్రమౌళి, ఇనాం తదితరులు పాల్గొన్నారు.

161 హైవేపై సేఫ్టీ నిబంధనలు ఏర్పాటు : పీడీ



ఎంపీకి జీవో కాపీలు అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

పెద్దశంకరంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 161వ జాతీయ ప్రధాన రహదారిపై జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ సూచనల మేరకు సేఫ్టీ నిబంధనలను డిసెంబరు నెలాఖరులోగా ఏర్పాటు చేయనున్నట్లు నేషనల్ హైవే పీడీ మాధవి సోమవారం తెలిపారు. ఇటీవల ఎంపీ నేషనల్ హైవే అథారిటీకి ప్రమాదాల నివారణకు పలు సూచనలిచ్చారు. దీంతో అధికారులు స్పందించి 161వ జాతీయ ప్రధాన రహదారిపై సోలార్ బ్లింకర్లు, ఎంబీసీబీలు, మెయిన్ రోడ్డులో రబ్బర్ స్ట్రిప్స్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నట్లు పీడీ తెలిపారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ నుంచి వచ్చిన జీవో కాపీలను ఎంపీకి చూయించారు.

యూనిటీ మార్చ్‌కు ఖేడ్ యువకులు





పవన్‌రాథోడ్, సాయిముదిరాజ్

నారాయణఖేడ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు ఉత్సవాలు ఈనెల 23 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నది. ఈ యూనిటీ మార్చ్‌కు నారాయణఖేడ్‌కు చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్ తెలిపారు. నారాయణఖేడ్ మండలం గుండు తండాకు చెందిన పవన్‌రాథోడ్, మాద్వార్‌కు చెందిన సాయి యూనిటీ మార్చ్‌కు ఎంపిక కావడంతో, వారికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి గుజరాత్‌కు జిల్లా నుంచి వెళ్తున్న యువకుల బృందంకు పంపించిందన్నారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమం



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని, ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలు అని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నాయకులు అన్నారు. సోమవారం సిద్దిపేటలో ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఇటువంటి హత్యా కార్యక్రమాలు చేపట్టారని విమర్శించారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని, అది చేయకుండా అడవులను విధ్వంసం చేస్తూ ఆక్సిజన్ లభించకుండా చేస్తున్నారని అన్నారు. అడవులను రక్షించే ఆదివాసి బిడ్డలను ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేస్తున్నారని ఆరోపించారు. ఈ హత్యలపై మానవహక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, ప్రభాకర్, విష్ణు, రాజేష్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో ప్రయాస్ ప్రేరణ-2025

- గ్రామీణ విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి కృషి
- ఐఐటీహెచ్‌లోని ఆర్‌డీసీ సహకారం



ఐఐటీహెచ్‌లో ప్రయాస్ ప్రేరణ కార్యక్రమంలో గ్రామీణ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐఐటీహెచ్ ఆర్‌డీసీ బృందం

కంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ లోని ఆర్‌డీసీ (రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్) ఆధ్వర్యంలో ప్రయాస్ 'ప్రేరణ-2025' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. ఐఐటీహెచ్ విద్యార్థుల నేతృత్వంలోని అవుట్ రీచ్ గ్రూప్ ప్రయాస్‌తో కలిసి గ్రామీణ పాఠశాల విద్యార్థుల్లో విశ్వాసం, అవగాహనతో పాటు వారికి ఓ ఆశయాన్ని కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కంది, ఇంద్రకరణ్, చేర్యాల, ఓడీఎఫ్, ఎద్దుమైలారం, కలివేముల గ్రామాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మెంటర్‌షిప్, సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ గణితంపై లెర్నింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్, ప్రయాస్ విద్యార్థి బృందం అంకిత భావంతో గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మహాత్మాగాంధీజీ చెప్పినట్లుగా భారతదేశ ఆత్మ గ్రామాలలో నివసిస్తుందన్నారు.

బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచే వారిని ఉరి తీయాలి



సంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినానంతరం మాట్లాడుతున్న వేదపండితుడు వరదచార్యులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దైవ సేవలో ఉన్న బ్రాహ్మణులు, బ్రాహ్మణ సమాజాన్ని కించపరుస్తూ అసభ్యకరంగా పాట పాడిన జీడి సారయ్యను బహిరంగంగా ఉరితీయాలని వేద పండితులు వరదచార్యులు అన్నారు. జీడి సారయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజాన్ని హేయంగా చూపిస్తూ కుల ద్వేషాలను రెచ్చగొట్టేలా పాటపాడడం చట్టపరంగా శిక్షార్హమైనదన్నారు. ఇలాంటి పాటలు, వ్యాఖ్యల వల్ల కుల విరోధాలను పెంచే ప్రమాదం ఉన్నదని, సామాజిక శాంతి సామరస్యాన్ని భంగం చేసేలా ఉన్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న సమాజంలో అశాంతి, అలజడిని సృష్టిస్తాయన్నారు. తమ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని భగవంతుడి సేవలో ఉన్న తమకు ఆగ్రహం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. సారయ్యపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇంకెవ్వరు కూడా ఇలాంటి వ్యాఖ్యలు గాని పాటలు కాని కార్యక్రమాలను నిషేదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిశంకర్‌కుమార్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు శిరీష, రజనీ, బీజేపి నాయకులు కొండాపురం జగన్, ద్వారకా రవి, పవన్‌కుమార్‌గౌడ్, కసిని వాసు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా అత్యుత్తమ సేవలు : డీజీఎం

- ఉమ్మడి జిల్లాలో రూ.2,200 కోట్ల రుణాలు



స్వర్ణనిధి డిపాజిట్ స్కీమ్ కరపత్రాలు ఖాతాదారులతో కలిసి ఆవిష్కరిస్తున్న డీజీఎం చంద్రశేఖర్

నారాయణఖేడ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా అత్యుత్తమ సేవలతోపాటు అన్ని కమర్షియల్ బ్యాంకులంటే అధిక వడ్డీని అందిస్తున్నామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఖేడ్‌లోని డీసీసీబీ బ్రాంచిని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో స్వర్ణనిధి డిపాజిట్ స్కీమ్‌కు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తమ బ్యాంకు ఖాతాదారులకు ఏటీఎం సదుపాయాలు కల్పిస్తూ డెబిట్‌కార్డులు అందిస్తున్నామని, ఫోన్‌పే, గూగుల్‌పే తదితర అన్ని సదుపాయాలు పొందవచ్చని అన్నారు. కొత్త ఖాతాదారులకు 10 నిమిషాల్లోనే ఖాతా తెరిచి ఇస్తామన్నారు. ఈ నెలాఖరు తేదీతో స్వర్ణనిధి 444 రోజుల ఫిక్స్ డిపాజిట్ నూతన పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. ఇందులో డిపాజిట్ చేస్తే 7.75 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8.25 శాతం వడ్డీ అందజేస్తామన్నారు. డిపాజిట్ చేసిన వారికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ ద్వారా రూ.2200 కోట్ల రుణాలు అందజేశామని, రీకవరీ పరిస్థితి కూడా బాగా ఉందని డీజీఎం చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచి మేనేజర్ జాదవ్‌కిషన్, రికవరీ అధికారి రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

తూప్రాన్‌లో మూతపడిన మైక్రో ఫైనాన్స్

- ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులతో మహిళ మృతి ఆరోపణలు



మూతపడిన మైక్రో ఫైనాన్స్ సంస్థ కార్యాలయం

తూప్రాన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని మైక్రో ఫైనాన్స్ సంస్థ సోమవారం మూత పడింది. ఆదివారం తూప్రాన్‌కు చెందిన వరలక్ష్మి(35) మైక్రో ఫైనాన్స్ వేధింపులతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మహిళ ఆత్మహత్యకు కారణంగా పేర్కొంటున్న క్రిస్ మైక్రో ఫైనాన్స్ సంస్థ సోమవారం ఉదయం నుంచి మూసివేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకలాపాలు నిర్వహించే క్రిస్‌మైక్రో ఫైనాన్స్ సంస్థ మూసి ఉండటం చర్చనీయాంశంగా మారింది. రికవరీ ఏజెంట్లు వేధించడంతోనే మనస్తాపానికి గురై వరలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు.

రంగనాయక్‌సాగర్ పైపుల అపహరణ

- 11 మంది నిందితుల అరెస్ట్

సిద్దిపేట క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగనాయకసాగర్ కాలువకు సంబంధించిన ఎనిమిది పైపులు చోరీకి గురయ్యాయి. మెగా కంపెనీ యార్డులో దాచి ఉంచిన ఇనుప పైపులను క్రేన్లు, లారీలను ఉపయోగించి చోరీచేశారు. కంపెనీ క్రంటాక్టర్లుగా పనిచేసిన వారు మరికొందరితో కలిసి విడతల వారీగా పైప్‌లను కట్‌చేసి తరలించారు. ఈ కేసులో 11 మంది నిందితులను సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి వెల్లడించారు. గాడిచెర్లపల్లి శివారులోని మెగా కంపనీ యార్డులో రంగనాయక్‌సాగర్ కాలువకు సంబంధించిన ఎనిమిది పైపులు చోరీకి గురైనట్లు కంపెనీకి చెందిన బి. సాగర్ ఈనెల 18న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీపీ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏసీపీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా బీహార్‌కు చెందిన రోహిత్ తంతి, చాలమల్ల వెంకట్‌రెడ్డి, ములుగు సాయికుమార్, కాకి శ్రీనివాస్, లియాఖత్, వాజిద్, నేరెళ్ల శ్రీకాంత్, ముంగిస్పల్లీ, పొన్నాల రమేష్, పొన్నాల సతీష్, పవన్‌లను అరెస్ట్ చేశారు. కంపెనీలో పెయింటింగ్ కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డి, అదే కంపెనీలో వెల్డింగ్ కంట్రాక్టర్ రోహిత్‌తంతిలకు కంపెనీలో పైపులు ఎక్కడ ఉంటాయో తెలుసు. గతంలోనూ వీరు కంపెనీలో పైపులు దొంగలించారు. ఈ క్రమంలో ఎనిమిది పైపులు దొంగలించాలని పథకం వేసి, సిద్దిపేటకు చెందిన స్క్రాప్ దుకాణ యజమాని కాకి శ్రీనివాస్‌ను సంప్రదించి పైపులు తీసుకువస్తే అమ్మిపెట్టమని ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత ఇదే కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన ములుగు సాయి సహకారంతో అక్టోబరు 26, 27 నవంబరు 11 తేదీల్లో విడతలవారీగా పైపులను కట్‌చేసి క్రేన్లు, లారీల్లో తీసుకెళ్లారు. వాటిని శ్రీనివాస్‌కు అప్పగించగా, అతను మెదక్ జిల్లా మనోహరాబాద్, శంకరంపేటల్లోని ఐరన్ కంపెనీలకు విక్రయించాడు. వచ్చిన డబ్బులను నలుగురు పంచుకున్నారు. నిందితుల నుంచి రూ.40 లక్షల విలువైన 60 టన్నుల ఇనుము, రూ.3.95 లక్షల నగదు, రెండు క్రేన్లు, బొలేరో వాహనం, నాలుగు గ్యాస్ కట్టింగ్ మిషన్లు, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సొత్తు కొనుగోలు చేసిన వారినీ అరెస్ట్ చేశారు.

జాతీయ జంబూరి ప్రదర్శనకు విద్యార్థులు

పాపన్నపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్ లక్నోలో నిర్వహించే 19వ జాతీయ జంబూరి ప్రదర్శనలో పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, స్కౌట్ మాస్టర్ రాజేందర్, పాఠశాల నుంచి ఏడుగురు స్కౌట్ దీక్షా విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. సోమవారం తమ ప్రదర్శన చేశారు.

బీసీ రిజర్వేషన్ల జీవో ప్రతులు దహనం

సంగారెడ్డి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై తీసుకువచ్చిన జీవో 46 ప్రతులను సోమవారం సంగారెడ్డిలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్, వర్కింగ్ చైర్మన్ కృష్ణ, నాయకులు శ్రీధర్ మహేంద్ర, మల్లికార్జున్‌పాటిల్, లక్ష్మి, మంగగౌడ్, వీరమణి, నాగరాణి, శృతిగౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి

- మూడు నెలల క్రితమే వివాహం
- భర్తతో కలిసి వెళ్తుండగా ఢీ కొన్న ట్రాక్టర్



ప్రణవి

మిరుదొడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ అదుపు తప్పి బైక్‌ను ఢీ కొనడంతో నవ వధువు మృతి చెందింది. భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా, ఈ ఘటన జరిగింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం చెప్యాల శివారులో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. సిద్దిపేటకు చెందిన సాయికిరణ్, ప్రణతిలకు మూడు నెలల క్రితమే వివాహమైంది. ఉద్యోగ నిమిత్తం వారు సోమవారం సిద్దిపేట నుంచి సంగారెడ్డికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. వీరు మండలంలోని చెప్యాల శివారుకు చేరుకోగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ అదుపుతప్పి బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరికీ గాయాలు అయ్యాయి. వెనుకే వస్తున్న 108 వాహనంలో భార్యభర్తలిద్దరిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ప్రణతి మృతి చెందింది. సాయికిరణ్ చికిత్స పొందుతున్నాడు.

భార్యతో గొడవపడి వ్యక్తి బలవన్మరణం



బాలేష్(ఫైల్)

రామాయంపేట,నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): అప్పుల పాలైన వ్యక్తి భార్యతో గొడవ పడి మనస్తాపంతో ఉరేసుకుని బలవన్మరణం చెందిన ఘటన సోమవారం రామాయంపేట మండల పరిధి ధర్మారంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన లింగరమైన బాలేష్(34) ఐదేళ్ల క్రితం కనకలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వారికి ఒక సంవత్సరం బాబు ఉన్నాడు. కాగా బాలేష్ కొద్ది రోజులుగా ఏ పని చేయకుండా దొరికిన చోటల్లా అప్పు చేశాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య సోమవారం మధ్యాహ్నం గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలేష్ ఇంట్లో నుంచి వెళ్లి పోయి తండ్రికి ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలిస్తుండగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్న బాలేష్ మృతదేహం కనిపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



శివ(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పంతులపల్లి గ్రామానికి చెందిన మున్నూరు రాములు, వీరమణిల కుమారుడు శివ(23) కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో ఉంటూ ఓ కంపెనీలో పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గత అక్టోబరు 21న శివ రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి శివ మృతి చెందాడు. ఉన్న ఒక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు భోరున విలపించారు. శివ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్కూల్ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న యువకులు

జహీరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రావుస్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సులో సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విద్యార్థులతో వెళ్తున్న బస్సులో పొగలు రాగా, గమనించిన డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి వివరాలు.. పట్టణంలోని రావుస్ పాఠశాలకు చెందిన బస్సు 39 మంది విద్యార్థులతో మహీంద్రా కాలనీకి వెళ్తోంది. ఈ క్రమంలో పాత ఆర్టీఏ చెక్‌పోస్టు వద్దకు రాగానే బస్సు బ్యాటరీ నుంచి పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు నిలిపి విద్యార్థులను కిందికి దింపారు. అప్పటికే బస్సుకు చిన్నగా మంటలు అంటుకోవడంతో అటుగా వెళ్తున్న యువులు మంటలను ఆర్పివేశారు. దీంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది.

హల్దీ వాగులోకి దూసుకెళ్లిన కంటైనర్

- ఇరువురికి స్వల్ప గాయాలు

తూప్రాన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హైవేపై వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి హల్దీవాగులోకి దూసుకెళ్లగా వాగులోపల చెట్టు అడ్డుపడడంతో అక్కడే ఆగిపోయింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. తూప్రాన్ పట్టణ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నాగ్‌పూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ సోమవారం తూప్రాన్ పట్టణ పరిధి హల్దీవాగు బ్రిడ్జి వద్దకు రాగానే అదుపు తప్పి హల్దీవాగులో దూసుకెళ్లింది. వాగులో చెట్లు అడ్డుగా ఉండటంతో మధ్యలోనే నిలిచిపోయింది. కంటైనర్ లారీ డ్రైవర్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విమల్ యాదవ్, క్లీనర్ వికాస్ యాదవ్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తృటిలో ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుబడిన ఎండు గంజాయి

మునిపల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా ఎండు గంజాయి పట్టుబడింది. బీదర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ స్కూటీని అనుమానంతో తనిఖీ చేయగా అందులో 115గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితులు హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన దేవరకొండ నాని, పల్లి సాయి పవన్‌లను పోలీసులు విచారించగా బీదర్‌లోని ఇరానీ గల్లీలో తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వారు అంగీకరించారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు ఒక స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులైన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వాహన తనిఖీల్లో కానిస్టేబుళ్లు హ నీఫ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బస్టాండ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

గజ్వేల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్ పనులను త్వరగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మర్కంటి కనకయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన బస్టాండ్ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగానే నిలిపివేస్తుందని మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ బస్టాండ్‌ల నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా బస్టాండ్లను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రేపు మర్పడగ క్షేత్రంలో సుబ్రహ్మణ్య షష్టి

కొండపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఈ నెల 26న బుధవారం సుబ్రహ్మణ్య షష్టి పర్వదిన ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయని క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గణపతి పూజ, కలశ స్థాపన, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశేష పంచామృత ఫలరస అభిషేకం జరుగుతాయన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

ఆకునూరు క్షతగాత్రులకు ఆర్థికసహాయం

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్యాస్‌సిలిండర్ పేలిన ఘటనలో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆకునూరు గ్రామానికి చెందిన శెట్టి భాస్కర్ కుటుంబీకులను కేఆర్ఆర్ ట్రస్ట్ అధినేత కర్రెడ్ల రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు.

మంచాల చిరంజీవులును పరామర్శించిన కొమ్మూరి



కాంగ్రెస్ నాయకుడు మంచాల చిరంజీవులును పరామర్శిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అస్వస్థతకు గురైన చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంచాల చిరంజీవులును సోమవారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యపరీక్షలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు. వెంట పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మురవి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, నాయకులు తదితరులున్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

కొమురవెల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ ఎస్ఐ నీరేష్ మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు పిల్లలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నియమాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బీసీలకు దక్కింది 26 శాతం

(5వ పేజీ తరువాయి)

రిజర్వేషన్లలో 28.5 శాతం కేటాయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ గత ఆదేశాల మేరకు అధికారులు అప్పట్లో రిజర్వేషన్లను ప్రకటించారు. అయితే, న్యాయస్థానం జోక్యంతో 50 శాతం రిజర్వేషన్లు మించవద్దు అన్న సూచనతో ఆ నిర్ణయాన్ని సవరించాల్సి వచ్చింది. 2019 ఎన్నికల రిజర్వేషన్లను రోటేషన్ పద్ధతిలో అనుసరిస్తూ, 2011 జనగణన, 2024 బీసీ కులగణన ఆధారంగా ప్రస్తుత రిజర్వేషన్లు ఖరారు చేశారు. దీంతో 42% బీసీ రిజర్వేషన్లను ఆశించిన సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేద్దామనుకున్న ఆశావహులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

పావులు కదుపుతున్న అభ్యర్థులు

రిజర్వేషన్ల ప్రకటనతో గ్రామాల్లో ఒక్కసారిగా సందడి నెలకొంది. సవరించిన తుది జాబితా ఆధారంగా అభ్యర్థులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా వెలువడే అవకాశం ఉండడంతో, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు తెరవెనుక పావులు కదుపుతున్నారు. ప్రధాన మూడు పార్టీలు కూడా అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు క్షేత్రస్థాయిలో ప్రచారానికి కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు పక్కనే చెత్త

- కోతులు, కుక్కల బెడదతో ప్రజలు బేజారు

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులతో పాటు చెత్త సేకరణకు వచ్చేవారు చెత్తబండిలో వేయాలని సూచిస్తున్నా కొందరు యథేచ్ఛగా రోడ్డుపై పడేస్తుండటంతో కాలనీవాసులు కుక్కలు, కోతుల బెడదతో ఆందోళన చెందుతున్నారు. చేర్యాల పట్టణంలోని పాత పెట్రోల్ పంపు పక్క గల్లీలో ఈ దుస్థితి నెలకొన్నది. పలుమార్లు మున్సిపల్ అధికారులు హెచ్చరించినా చెత్తవేసే వారిలో మార్పు కన్పించకపోవడం గమనార్హం. ఇళ్లలోని ఆహారపదార్థాల వ్యర్థాలను కాలనీలోని బహిరంగ ప్రదేశంలోనే పారబోస్తుండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు కోతులు, కుక్కలు ఆ పరిసరాల్లోనే యథేచ్ఛగా సంచరిస్తూ కాలనీ దాటి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. కోతుల బారిన పడి గాయాలైన సందర్భాలు చోటుచేసుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుధ్య పనులపై పటిష్టమైన పర్యవేక్షణ, నిఘా లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చెత్తవేసేవారిపై నిఘా పెట్టి భారీగా జరిమానాలు విధించి కుక్కల, కోతుల బెడద నుంచి తమను కాపాడాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చేర్యాలలోని పాత పెట్రోల్ పంపు పక్క గల్లీలో రోడ్డుపై పారబోసిన చెత్తలో కుక్కల సంచారం

వెలికట్ట క్రాస్‌రోడ్ సమస్యల పరిష్కారానికి చర్యలు



వెలికట్ట క్రాస్‌రోడ్ ప్రాంతాన్ని పరిశీలించి ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఏసీపీ

కొండపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద 'ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోరా?' అనే శీర్షికన ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించి తగిన చర్యలు చేపట్టారు. గజ్వేల్ ఏసీపీ నర్సింలు తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తో కలిసి సోమవారం వెలికట్ట క్రాస్‌రోడ్‌ను సందర్శించారు. క్రాస్ రోడ్ వద్ద రోడ్డుపై ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఆటోలు నిలుపవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. బస్ షెల్టర్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. రోడ్ కనిపించకుండా ఏర్పాటు చేసిన డబ్బాలను తీసివేయాలని తెలిపారు.

సామాజిక తనిఖీలో అవకతవకల గుర్తింపు

- పలువురికి రూ.19వేలు జరిమానా.. రూ.26వేలు రికవరీకి చర్యలు



ప్రజావేదికలో వివరాలను వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేర్యాల మండలంలో 2024-25 ఆర్థికసంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో ప్రిసైడింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, అంబుడ్స్‌మెన్ అనిల్, ఏపీడీ సతీశ్, జిల్లా విజిలెన్స్ అధికారి గణేశ్ హాజరయ్యారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామాల వారీగా గుర్తించిన అవకతవకలను సమావేశంలో ప్రస్తావించారు. సుమారు రూ.8కోట్ల మేర పనులు జరిగాయని, ఆయా పనులకు సంబంధించి రికార్డుల నమోదు, వేతన చెల్లింపు, ఇతరత్రా అంశాల లోటుపాట్లను వెల్లడించారు. ఈ మేరకు పలువురు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.19వేల మేర జరిమానా విధించగా, రూ.26వేల మేర రికవరీకి ఆదేశించారు. అనంతరం డీఆర్డీవో ప్రిసైడింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను మరింత పటిష్టంగా అమలుపరచాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో నూతన మొక్కలు త్వరగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రణయ్, సీఆర్పీ పాండురంగ, ఏపీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్‌లో ఉన్నవారికి టెట్ మినహాయించాలి

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతి కృష్ణ పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలో సోమవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లక్రితం డీఎస్సీ లాంటి ప్రత్యేక పరీక్షలు రాసి ఉద్యోగంలో చేరి బోధన చేస్తున్న క్రమంలో ప్రస్తుతం టెట్ పరీక్ష పాస్ కావాలని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. టెట్ పరీక్షలో 150మార్కులలో భాషోపాధ్యాయుల భాషకు సంబంధించి 30 మార్కులే ఉంటాయని, తమకు సంబంధంలేని విషయాలను పరీక్షించడం అన్యాయమన్నారు. భాషాపండితులను మానసిక వేధింపులకు గురిచేయడానికి తీసుకున్న చర్యలు వీడాలన్నారు. సమావేశంలో నాయకులు కనకలింగం, రజియొద్దీన్, సంతోశ్, రాజకృష్ణ, గణేశ్, సాజిదాబేగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌యూపీపీటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతికృష్ణ

భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సింగారంలో మాట్లాడుతున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సింగారం గ్రామంలో భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్రపై ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశ రాజ్యాంగ ముసాయిదా చేపట్టిన దినం నవంబరు 26 అని, ఈ సందర్భంగా అంబేడ్కర్‌ను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతీ పాఠశాలలో ప్రతిజ్ఞ సమయంలో రాజ్యాంగ పీఠిక చదివించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా... భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం నవంబరు 26 నుంచి మొదలుకుని జనవరి 26వరకు రాజ్యాంగ పరిరక్షణ యాత్రను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలల్లో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించాలి

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించాలని మాల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టూ వీలర్ ఉచిత శిక్షణ

హుస్నాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈడీ సెల్ ఆధ్వర్యంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు 50 రోజుల పాటు ఉచిత టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ ట్రైనింగ్‌ను ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసిన యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్, ఉద్యోగాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువతీ యువకులు తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కోర్స్ కోఆర్డినేటర్ సైనాదేవి 9440709807 నెంబర్‌ను సంప్రదించాలని, మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం డిసెంబరు 1వ తేదీ నుంచి కళాశాలలో ప్రారంభమవుతుందన్నారు.

సీఈని కలిసిన విద్యుత్ ఉద్యోగులు



సీఈకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల 400 కేవీ సబ్‌స్టేషన్‌కు చెందిన విద్యుత్ ఉద్యోగులు ఫోర్త్ ఆపరేటర్ కావాలని హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో సీఈ వాసుదేవరావుని కలిశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు విద్యుత్ ఉద్యోగులు తెలిపారు. సీఈని కలిసినవారిలో సాగర్, సంజీవ్, కాశీరాం తదితరులున్నారు.

పఠనాసక్తిని పెంపొందించుకోవాలి



పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లైబ్రరీని ప్రారంభించి మాట్లాడుతున్న ఎంఈవో

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పుస్తక పఠనాసక్తిని పెంపొందించుకోవాలని ఎంఈవో రచ్చ కిష్టయ్య అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన రూమ్ టు రీడ్ లైబ్రరీ గదిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజమణి, పాఠశాల హెచ్ఎం టింగిరికార్ కిషన్, ఉపాధ్యాయులు దొంగల అయిల్‌రెడ్డి, ఈగ ఆంజనేయులు, కర్రోల్ల విజయ్‌కుమార్, రుద్రారం సంధ్యారాణి, స్వరూప, కవిత తదితరులు పాల్గొన్నారు.

జనగామ డీసీసీ అధ్యక్షురాలిని కలిసిన మండల నాయకులు



జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతితో నాయకులు

మద్దూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ నూతన అధ్యక్షురాలిగా నియామకమైన లకావత్ ధన్వంతిని సోమవారం మద్దూరు మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ మఠం భద్రయ్య, జిల్లా నాయకులు గంపల కృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. డీసీసీని కలిసిన వారిలో మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తాళ్లపల్లి వీరేందర్‌గౌడ్ ఉన్నారు.


జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థి



జాతీయస్థాయికి ఎంపికైన ఆదిత్యతో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, పీడీ

మద్దూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థి సలాది ఆదిత్య రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీల్లో ప్రతిభ కనపర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. గత నెల కోస్గి ప్రాంతంలో 7,8,9 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని తూమకూర్ జిల్లాలో జరుగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, పీడీ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం ఆదిత్యను అభినందించారు.

అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్‌గా అబ్దుల్ రహ్మాన్



తహసీల్దార్‌ను శాలువాతో సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్‌గా అబ్దుల్ రహ్మాన్ సోమవారం పదవీబాధ్యతలను స్వీకరించారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన తహసీల్దార్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జెన్నారెడ్డి, భిక్షపతి తదితరులున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 12మందికి జరిమానా.. ఇద్దరికి జైలు

గజ్వేల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి రూ.1.20లక్షల జరిమానా విధించారు. ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల గజ్వేల్ పట్టణంలో మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన 12మందిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. నిందితుల్లో ఇద్దరికి జరిమానాతో పాటు 2రోజుల జైలుశిక్షను విధిస్తూ తీర్పును వెల్లడించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే చీరల పంపిణీ



గజ్వేల్‌లో మాట్లాడుతున్న దేవి రవీందర్

గజ్వేల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లోకల్ బాడీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీటీసీల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవిందర్ విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇవ్వని చీరలను స్థానిక ఎన్నికలకు ముందు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆగ్రహాన్ని తగ్గించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని, మహిళలకు ఇచ్చిన రూ.2500 పథకాన్ని వెంటనే అమలు చేయాలని, పింఛన్లను పెంచాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బెండే మధు, నాయకులు ఉన్నారు.

రేబర్తిలో అండర్ గ్రౌండ్ పనుల పరిశీలన



రేబర్తిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మద్దూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన అండర్ గ్రౌండ్ నాళాలకు చేపడుతున్న మరమ్మతు పనులను సోమవారం ఎంపీడీవో ఎస్. రాంమోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా పనులు జరిపించాలని సెక్రటరీ మాధవ్‌కు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. ఆయిల్ పామ్‌తో పాటు నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నేతలు

సిద్దిపేట అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, ఈ మేరకు నూతనంగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కార్మిక సంఘం నేతలు గోపాలస్వామి కిష్టాపురం లక్ష్మణ్ పిండి అరవిందు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేటలో సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 26న కార్మిక వ్యతిరేక విధానాలకు రైతు వ్యతిరేక విధానాలకు చేపట్టిన దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో రైతులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చేర్యాలలో మానవహారం



జాతీయరహదారిపై చేర్యాలలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం ఆవిర్భవించి 150 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై స్థానిక అంగడిబజారువద్ద మానవహారం చేపట్టి వందేమాతర గీతాలాపన చేశారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో వందేమాతరగీతం ప్రజల్లో దేశభక్తిని పెంపొందించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తౌట బాలరాజు, కొట్టి చంద్రమౌళి, మన్నె సత్యవర్ధన్, కాశెట్టి పాండు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెట్లపొదలను తొలగించిన పోలీసులు



రహదారిని చదును చేయిస్తున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) క్రాసింగ్ నుంచి మీర్జాపూర్ వరకు రహదారికి ఇరువైపులా చెట్ల పొదలు ప్రమాదకరంగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహదారులు ఆందోళనకు గురయ్యేవారు. హుస్నాబాద్ పోలీసులు సోమవారం డోజర్ సహాయంతో రోడ్డుపై ప్రమాదకరంగా పెరిగిన చెట్ల పొదలను తొలగించారు. హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి సహకారంతో రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి రహదారిని చదును చేయించారు. పోలీసుల కృషిని అభినందిస్తూ మీర్జాపూర్ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ధ్యేయంతో ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపీటీసీ తుప్పతి అంజి యాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి చీరలను డ్వాక్రా మహిళలకు ఆయన పంపిణీ చేశారు.